
# సత్యవాక్యము

## the word of truth



క్రైస్తవ మాసపత్రిక

MAY 1997

## సంక్షిప్త వార్తలు

ఏప్రియల్ 6వ తేదీ ఆదివారం సాయంకాలము పెదపళ్ళ (తూ॥గో॥జిల్లా) గ్రామములో జరిగిన సువార్త కూటములో జాషువా గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. మరియు బేసిక్ బైబిలు కోర్సును జయప్రదముగా ముగించిన 14 మందికి సర్టిఫికెట్లు, బైబిళ్లు బహుమానముగా యిచ్చిరి. పెదపళ్ళలో సోదరులు జి. ఇశ్రాయేలు గారు పనిచేయుచున్నారు.

ఏప్రియల్ 7,8,9,10 తేదీలలో విజయవాడ దుర్గాపురంలోని క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించిరి. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు, సాయంత్రం ఆరుగంటలకు కూడికలు ఏర్పాటు చేయబడగా వందలాది ప్రజలు వచ్చి సత్యసువార్త నాలకించిరి. జాషువా గూటం, శేషాద్రి గూటం, ఫ్రాన్సిస్ డేవిడ్ (న్యూఢిల్లీ), జి.మార్కు, ఐ.ఇశ్రాయేలు, జి.షద్రక్, టి.ప్రసాదరావ్ గార్లు ఈ కూటములలో గొప్ప వాక్యపరి చర్య చేసిరి. జి.శ్యాంప్రసాద్ గారు ఫ్రాన్సిస్ డేవిడ్ గారి ఆంగ్ల ప్రసంగములను సమర్ధవంతముగా తెలుగునకనువదించిరి. ఈ కూటములద్వారా మొత్తం 8 మంది క్రీస్తు లోనికి చేర్చబడిరి. వచ్చినవారందరికి స్థానిక సంఘము చక్కటి ఏర్పాట్లు చేసెరి. దుర్గాపురంలోను, పరిసర ప్రాంతములలోను కె.రాజకుమార్ గారు గొప్ప పరిచర్య చేయుచున్నారు. వారి కృషి ఎంతో అభినందనీయమైనది.

ఏప్రియల్ 11,12,13 తేదీలలో నిజామాబాద్ పట్టణములో నిజామాబాద్ క్రీస్తు సంఘము గొప్ప సువార్త కూటముల నేర్పాటు చేసిరి. ప్రతికూటమునకు వందలకొలది ప్రజలు హాజరై దేవుని దివ్య గ్రంథములోని గొప్ప సంగతులను విన గల్గిరి. సోదరులు ఫ్రాన్సిస్ డేవిడ్ (న్యూఢిల్లీ), ఆర్. సిహెచ్. సద్గుణరావ్ (శ్రీకాకుళం), జాషువా గూటం గార్లు ఆ కూటములలో వాక్యపరిచర్య చేసిరి, ఈ కూటములకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరగుట ద్వారా స్థానిక సంఘము దేవుని స్తుతించిరి. ఆఖరిరోజున ఎనిమిది మంది స్త్రీ పురుషులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నిజామాబాద్‌లో ఎన్. టైటస్ గారు, వారి కుమారుడు ఎబినేజరు గారు గొప్ప పని చేయుచున్నారు. స్థానిక సంఘ యౌవనస్థులు చక్కటి పాటలు పాడిరి. వారికి చక్కటి తర్ఫీదు నిచ్చిన రవిబాబు దంపతులు అభినందనీయులు.

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH


**P.o. Box 80, Kakinada, A.P. 533 001.**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**


**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 మే 1997 సంచిక 10


## సంపాద కీయం

### నీ పేరు జీవగ్రంథములో వ్రాయబడి యున్నదా ?
### ( Is Your Name written in the Book of Life ? )

గ్రంథములు విప్పబడుటయు, ఆ గ్రంథమందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందుటయు ప్రకటన గ్రంథము 20:12లో చదువగలము. గ్రంథములు అనగా దేవుని గ్రంథమైన బైబిలును సూచించుచున్నది. ఇది అనేక గ్రంథముల (పుస్తకముల) కలయిక. పాత, క్రొత్త నిబంధనలు అరువదియారు పుస్తకములతో నిండియున్నవి. దేవుని గ్రంథము లేక గ్రంథములలో వ్రాయబడి యున్న వాక్యముల యొక్క శక్తిని, ప్రభావమును వాటి తీవ్రతను గూర్చి యోహాను ఈ విధముగా చెప్పుచున్నాడు. "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా-ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను తీసివేసిన యెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రకటన 22:18,19). మనము దేవుని వాక్యము చదువునప్పుడు

గాని అర్థము చేసుకొని అనుసరించునప్పుడు గాని చాల జాగ్రత్తగా వ్యవహరించాలి. దానితో ఏమియు కలుపకూడదు. దానినుండి ఏమియు తీసివేయకూడదు. మనము వాక్యమును నమ్మి, విధేయత చూపి అనుసరించవలయును; ఎందుకనగా ఆ వాక్యమును బట్టియే మనము తీర్పు తీర్చబడుదము. క్రీస్తు ఈ విధముగా చెప్పెను. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). అయితే మనము దేవుని ఈ మాటలను ఎక్కడ కనుగొనగలము ? యోహాను చెప్పిన ఈ గ్రంథముల (ప్రకటన 20:12) యందే కదా ! కాబట్టి మానవుడు ఈ గ్రంథములయందు అనగా బైబిలునందు వ్రాయబడిన వాక్యములను బట్టియే తీర్పు తీర్చబడుననునది నిర్వివాదం. గనుక మనము దేవుని వాక్యమును గౌరవించి విధిగా అంగీకరించ వలసిన అవసరత ఎంతయో గలదు. దేవుని వాక్యమును సమ్మతించాలి, ఆ గొప్ప తీర్పు దినమున మనమంతా ఆయన ఎదుట అంగీకరింపబడాలి.

ప్రకటన గ్రంథము 20:12లోనే వేరొక గ్రంథమును గూర్చి వ్రాయబడి యున్నది. అదియే జీవగ్రంథము. దేవునికి చెందినవారు లేక దేవునికి విధేయులైన వారి పేర్లు ఆ గ్రంథమందుండునని చెప్పబడుచున్నది. ఆ గ్రంథము విప్పబడినది అనగా ఒకని పేరు అందున్నదో లేదో తెలుసుకొనుటకు తెరువబడినదని దాని అర్థము. ఎవని పేరైన అందులో లేనట్లయిన అతడు పరలోక ప్రవేశమునకు అనర్హుడు.

బహుశా దేవునియొద్ద మనవద్ద వున్నటువంటి పుస్తకము లేక గ్రంథము లాంటిది ఏదో ఒకటి ఉన్నదని, అందులో ఆయనకు విధేయులైన వారి పేర్లు వ్రాయబడియున్నవని నీ వనుకొనుచున్నావా ? మనమధ్య యిప్పుడు కాగితముపై సిరాతో ముద్రింపబడిన దేవుని వాక్యము గ్రంథరూపములో యున్నది. ఇటువంటిది ఏదో ఒకటి పరలోకములో దేవుని యొద్ద కలదని తలంచవద్దు. ఆయన చెప్పిన జీవ గ్రంథమను మాట అలంకార రూపకముగా చెప్పబడినది. దేవుని వాక్యముచే రక్షింపబడి పరలోక ప్రవేశానికి అర్హులైన వారి పేర్లు ఆయన జ్ఞాపకములో నుండుటయే ఒక (రికార్డు) ను సూచించుచున్నది. మరి ఎక్కువగా ఆయనకు

చెందిన వారెవరో ఆయనకు తెలుసు; వారి పేర్లు తెలుసు; రక్షింపబడినవ వారెవరో ఆయనకు గుర్తే. ఆయన మదిలో ముద్రితమై జ్ఞాపకమున్న పేర్లనే జీవగ్రంధమందు వ్రాయబడి యున్నవని అలంకారంగా చెప్పబడి యుండును. దీనితో సమాన భావము గలది ఒకటి అపొస్తలుల కార్యములు 2:47లో చూడగలము: "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘము) చేర్చు చుండెను". ఇంకా విపులంగా చెప్పాలంటే క్రీస్తు సువార్తకు విధేయులైన వారిని గుర్తించి వారిని సంఘములో చేర్చుచుండెను. ఆ సంఘము ప్రభువుయొక్క ఆత్మీయ కుటుంబము. ఈ విధముగా ప్రతివారి పేరు జీవగ్రంధములో వ్రాయ బడును. ప్రభువు అందరినీ తన సంఘములో చేర్చుకొనడు; తనచే గుర్తింపబడిన వారిని మరియు తన చిత్తప్రకారము చేయువారినే చేర్చుకొనును. ఈ విధముగా దేవుడు మానవుని తన వానిగా జ్ఞాపకముంచుకొనును.

నూతన యెరూషలేము అయిన పరలోక పట్టణములో దుర్మార్గులు, చెడ్డవారు, భక్తిహీనులు, పాపులు, అవిధేయులు ప్రవేశింపరు. అయితే గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంధమందు వ్రాయబడినవారే అందులో ప్రవేశింతురు (ప్రకటన 21:27). "మరియు ఎవని పేరైనను జీవగ్రంధమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును" (ప్రకటన 20:15) అని వ్రాయబడియున్నది.

అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాస్తూ "కావున నేనపేక్షించు నా సహోదరులారా! నా ఆనందమును నా కిరీటమునై యున్న నా ప్రియులారా యిట్లు ప్రభువునందు స్థిరులై యుండుడి. ప్రభువు నందు ఏకమనస్సు గలవారై యుండుడని యువొదియును, సుంటుకేసును బ్రతిమాలుకొనుచున్నాను. అవును నిజమైన సహకారీ ఆ స్త్రీలు క్లెమెంతుతోను నా యితర సహకారులతోను సువార్త పనిలో నాతో కూడ ప్రయాస పడినవారు గనుక వారికి సహాయము చేయుమని నిన్ను వేడు కొనుచున్నాను. ఆ సహకారుల పేర్లు జీవగ్రంధమందు వ్రాయబడియున్నవి" (ఫిలిప్పీ 4:1-3). పౌలు అట్లు ఏల చెప్పగలిగెను ? వారిపేర్లు జీవగ్రంధములో వ్రాయబడి యున్నవని పౌలుకు ఎట్లు తెలిసెను ? ఏలయనగా అతడు దేవుని

పరిశుద్ధ ఆత్మచే ప్రేరేపింపబడి దేవుడు తనకిచ్చిన జ్ఞానముతో వారు ప్రభువుకు విధేయులై రక్షింపబడిరని, సంఘములో చేర్చబడిరని, నమ్మకమైన క్రైస్తవులని వీటన్నిటిని బట్టి సంపూర్ణ విశ్వాసముతో వారి పేర్లు జీవగ్రంథమందు గలవని చెప్పెను.

జీవగ్రంథమందు వ్రాయబడిన తరువాత మానవుడు మరల పాపముచేసి తప్పిపోయిన యెడల అతని పరిస్థితి ఏమిటి ? ఇదీ ఆలోచింపవలసిన విషయమే. ఖచ్చితముగా అతని పేరు జీవగ్రంథమందునుండి తొలగింపబడవచ్చు. దీనికి సమాధానంగా ఒకసారి గతాన్ని తల్చుకొందము. మోషే ధర్మశాస్త్రాన్ని పొందడానికి సీనాయి కొండ ఎక్కిన సమయములో ఇశ్రాయేలీయులు అహరోను సహకారంతో ఒక బంగారు దూడను చేసి పూజించుచుండిరి. మోషే తిరిగి చూచి కోపపడి లేవీకుమారులను పాళెములోనికి పంపి కత్తివాత చంపించెను, వారి సంఖ్య మూడువేలు. "మరునాడు మోషే ప్రజలతో మీరు గొప్ప పాపము చేసితిరి గనుక యెహోవా యొద్దకు కొండ ఎక్కి వెళ్ళెదను; ఒకవేళ మీ పాపమునకు ప్రాయశ్చిత్తమము చేలగలనేమో అనెను. అప్పుడు మోషే యెహోవా యొద్దకు వెళ్ళి-అయ్యో ఈ ప్రజలు గొప్ప పాపము చేసిరి, వారు బంగారు దేవతను తమ కొరకు చేసికొనిరి; అయ్యో నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములో నుండి నా పేరు తుడిచివేయమని బతిమాలుకొనుచున్నాననెను. అందుకు యెహోవా-ఎవడు నాయెదుట పాపము చేసెనో వాని నా గ్రంథములో నుండి తుడిచివేయుదును" (నిర్గమ 32:30-33) అని చెప్పెను.

అవును నిజముగా ఒకని పేరు జీవగ్రంథమునుండి చెరిపివేయుటకు గాని ఉంచుటకు గాని ప్రభువునకు సర్వాధికారము గలదు. ఒకని పేరు జీవగ్రంథమునుండి తీసివేయబడెననగా అతని అవిధేయతను బట్టి దేవునికి అయిష్టత కలిగెనని గ్రహించగలము. అతడు మారుమనస్సు పొందక అదే అవిధేయతతో నిలచియుండి చనిపోయినట్లయితే ఖచ్చితముగా అతని పేరు జీవగ్రంథములో లేకపోవుటయు, కడకు అగ్నిగుండములో పడవేయబడుటయు జరుగును (ప్రసంగి 20:15). ఒకని

పేరు జీవగ్రంధమందు తుడిచివేయబడిన యెడల అతడు మారుమనస్సు నొంది పశ్చాత్తాపపడి తన పాపములను ఒప్పుకొనిన యెడల అతని పేరు తిరిగి జీవగ్రంధములో చేర్చబడుటకు అవకాశము గలదు (యాకోబు 5:6).

ఇంతమంది పేర్లను దేవుడు ఎలా జ్ఞాపకముంచుకోగలడని ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఆయనకు సమస్తము సాధ్యమే. భూమిమీదనున్న ప్రతి ఆత్మ ఉనికి ఆయనకు తెలుసు. ఒకని విధేయత వలన అతని రక్షించి సంఘమును చేర్చును (మార్కు 16:16; అ.కా. 2:38; 2:47). ఆ సమయమందే అతని పేరు జీవగ్రంధమందు రక్షింపబడిన వారి సరసన చేర్చబడును.

దేవుడు యిదంతా చేయునని ఎట్లు నమ్మడం? ఒకనికి తను రక్షింపబడ్డానని తన పేరు జీవగ్రంధములో లిఖించబడినదని తను చనిపోయిన తరువాత పరలోకములో ప్రవేశిస్తానని ఎట్లు తెలసుకోగలడు ? పరిశుద్ధ లేఖనములను బట్టి, దేవుని వాక్యమును బట్టి; ఆయన నమ్మకమైన వాగ్దానములను బట్టి; ఆయన ఆజ్ఞలకు విధేయులమై రక్షింపబడినామని మనపేర్లు జీవగ్రంధమందు చేర్చబడి యున్నవని నిత్యజీవములో ప్రవేశిస్తామను విశ్వాసమును బట్టియే తెలసుకొనగలము.

తీర్పుసమయమును ప్రభువు మనలను వ్యక్తిగతంగా గుర్తుంచుకొనుటయే గాక మన పనులు మన ఆలోచనలన్నియు జ్ఞాపకముంచుకొనును. పౌలు ఈ విధంగా అంటున్నాడు. "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2కొరింథీ 5:10). యేసుక్రీస్తు యిట్లనెను. "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును" (మత్తయి 12:36). హెబ్రీయుల పత్రిక లేఖకుడు ఇట్లు అనెను: "మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా వున్నది" (హెబ్రీ 4:13). దీనిని బట్టి మనము మాట్లాడిన ప్రతిమాట చేయు ప్రతిపని మరుగులేక ఆయనకు కనబడును గనుక వాటిని బట్టే తీర్పు

తీర్పుబడుదుమని తెలియుచున్నది..ఒకవేళ మన పాపము లన్నియు క్షమించబడి నట్లయిన మన పేర్లు జీవగ్రంథములో లిఖించబడి పరలోకములో నివాసము దొరకును. అట్లు కాక మనము పాపములోనే నిలచియుంటే మనపేరు జీవగ్రంథములో యుండదు సరిగదా అగ్నిగుండములో పడవేయబడుదము.

ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్న మనపై నున్నది. అదేమనగా మన పేర్లు జీవగ్రంథములో నున్నవా ? లేక తీసివేయబడినవేమో ? ఇంకను సమయము మించిపోలేదు. దేవుని వాక్యమునకు విధేయులై దాని ప్రకారము నడచుకొనుట వలన ఖచ్చితముగా మన పేర్లు జీవగ్రంథమందు చేర్చబడును.

## క్రీస్తుసంఘము ఏల సాటిలేనిది ?

క్రీస్తు సంఘము సాటిలేనిది ఏలయనగా :-

అది దేవుని సంకల్పమై యున్నది : దేవుడు, క్రీస్తులాంటి అనేకమంది కుమారులు కావాలని కోరిక కలిగియుండెను. దేవుడు నరుని తనతో బాటు నిత్యము జీవించాలని "తన పోలికచొప్పున తన స్వరూపమందు నిర్మించెను" (ఆది 1:26-28). "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది 2:7). కావున నరుడు శరీరము, ఆత్మ అను రెండు భాగములతో నిర్మించబడ్డాడు. నరుడు నిత్యము తన కుమారుడుగా తనతో సహవాసము కలిగి జీవించుటకు వాని కొరకు దేవుడు ఒక స్థలము నిర్మించెను. "దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను" (ఆది 2:8).

నరుడు దేవుని సహవాసము నుండి దూరమయ్యెను. దేవుడు ఆదామును ఏదెనులో తోటలో వుంచి అతనికి సాటి సహాయముగా ఆదాము ప్రక్కటెముకతో స్త్రీని నిర్మించి అతనికి ఇచ్చెను (ఆది 2:21-23). "దేవుడు ఆదాముతో ఏదెనుతోటలో వున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:17).

అయితే సాతాను శోధించుటవలన ఆదాము భార్య మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును తాను తినుట మాత్రమే కాక తన భర్తయైన ఆదాముకు కూడా ఇచ్చెను. అతడు కూడా తినెను (ఆది 3:1-6). వారు ఆ విధముగా దేవుని ఆజ్ఞను అతిక్రమించుటవలన దేవుని చేత శపింపబడి ఏదెను తోటలో నుండి వెళ్ళగొట్ట బడిరి. (ఆది 3:22-26). ఆజ్ఞాతిక్రమమే పాపము "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). ఆ విధముగా నరుడు నిత్యము జీవించే యోగ్యతను పోగొట్టుకొని దేవుని సహవాసమునకు దూరమయ్యెను (ఆది 3:19,22).

సంఘము స్థాపించ వలసిన కారణం : దేవుడు ఆదాము హవ్వల ద్వారా క్రీస్తు వంటి అనేకమంది కుమారులు కావాలని కోరుకొనెను. అందుకే ఆదాము హవ్వలను ఏదెను తోటలో వుంచెను. "దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా-మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరుచు కొనుడి" (ఆది 1:28). కాని దేవుని ఆజ్ఞను అతిక్రమించుట వలన ఆదాము హవ్వలు శపింప బడిన వారై ఏదెనుతోటలో నుండి వెళ్లగొట్టబడి దేవుని సహవాసమును కోల్పోయిరి. "ఆదాము ద్వారా లోకములో పాపమరణ నియమము ప్రవేశించెను" (1కొరింథీ 15:21-22).

తన సహవాసమునుండి దూరమైన మానవుని దేవుడు దయగలవాడై ప్రేమతో తిరిగి తనతో సమాధానపరచు కొనవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే సంకల్పించెను. అందుకే దేవుడు ఏదెను తోటకు మాదిరిగా క్రీస్తు సంఘమనెడి ఏదెను తోటను స్థాపించ నిశ్చయించెను (దయచేసి ఎఫె 1:4-1; ఎఫె 2:11-22 లను చదవండి).

## సంఘము అనగా ఎవరు ?

సంఘము అనగా పిలువబడినవారు. దేవుడు ప్రజలను లోకములోనుండి క్రీస్తులోనికి చీకటిలోనుండి వెలుగులోనికి సువార్త ద్వారా పిలుచుచున్నాడు. "ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందుగా ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యము గలవారవుటకు వారిని

ముందుగా నిర్ణయించెను. మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను. ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమ పరచెను" (రోమా 8:29-30).

ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారమునుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:13-14).

"ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమ ఫలముగా వుండునట్లు సత్యవాక్యమువలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకో 1:18).

సంఘస్థాపన గురించి దేవుడు ముందుగానే తెలియజేసెను:

ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు. అది మందు చెప్పిన రాజ్యము లన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయునుగాని అది యుగముల వరకు నిలుచును (దాని 2:44).

"ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనము ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును. ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని ఆమెతో చెప్పెను" (లూకా 1:31-33).

సంఘము స్థాపించిన విధానమును బట్టి క్రీస్తు సంఘము సాటిలేనిది. "మరియు నీవు పేతురువు ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" (మత్త 16:18).

"ఆయన వారిని కలిసికొని యీలాగు ఆజ్ఞాపించెను. మీరు యెరూషలేము నుండి వెళ్లక, నావలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి" (అ॥కా॥ 1:4).

పెంతెకొస్తు పండుగ దినమున క్రీ॥శ33లో యెరూషలేములో 3000 మందితో సంఘము స్థాపించబడెను (అ.కా. 2:37-47).

"క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు. ప్రతికట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువు నందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవుని నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫె 2:20-22).

నామమును బట్టి క్రీస్తు సంఘము పాటిలేనిది

1. దేవుడు తన స్వరక్తమిచ్చి సంఘమును సంపాదించెను (అ.కా. 20:28).

2. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు (కొలస్స 1:18).

3. "ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యము కంటెను అధికారముకంటెను శక్తికంటెను ప్రభుత్వముకంటెను ఈ యుగమునందు మాత్రమే గాక రాబోవు యుగము నందును పేరు పొందిన ప్రతినామము కంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము. సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫె 1:20-23).

4. ఫిలిప్పీ 2:5-11 ప్రకారము దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతినామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను. (దయచేసి ఫిలిప్పీ 2:5-11 చదవండి).

5. "క్రీస్తు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు" (హెబ్రీ 9:5).

6. "యేసు-నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహా 14:6).

7. "ఆ పెద్దలు నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలు విప్పుటకు యోగ్యుడవు, నీవు వధింపబడిన వాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను, ప్రతిప్రజలోను ప్రతిజనములోను దేవుని కొరకు మనుష్యులనుకొని, మాదేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులుగాను చేసితివి" (ప్రకటన 4:9-10). అందుచేత క్రీస్తు సంఘము సాటిలేనిది.

పరిపాలనను బట్టి క్రీస్తు సంఘము సాటిలేనిది.

సంఘము స్వయంప్రతిపత్తి కలిగియున్నది. దీనిపై మానవులకెవరికి అధికారము లేదు. ప్రతిస్థానిక క్రీస్తు సంఘము స్వయంప్రతిపత్తి కలిగియున్నది. దీని ప్రధాన కార్యాలయము పరలోకములో వున్నది. దేవుడు సర్వాధికారి. క్రీస్తు రాజుగా వుండి పరిపాలించుచున్నాడు. రాజ్యము సంఘమే. పౌరులు-క్రైస్తవులు. చట్టము-క్రొత్తనిబంధన. క్రీస్తు సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు (ఎఫె5:29-30). క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు (ఎఫె 5:23).

**ముగింపు :-** ఒకవ్యక్తి ఆత్మీయముగా దినదినము అభివృద్ధి చెంది, క్రీస్తు సారూప్యములోనికి మార్పుచెందాలంటే అటువంటి ఆత్మీయ వాతావరణము క్రీస్తునందు-క్రీస్తుసంఘములో మాత్రమే లభించును. ఆ ఉద్దేశ్యముతోనే దేవుడు మొదట ఏదెను తోటను నిర్మించెను. కాని సాతాను కుయుక్తి వలన దేవుని సంకల్పమునకు విఘాతము కలిగెను. కాని క్రీస్తు సిలువ మరణమును జయించుట ద్వారా సాతానుని ఓడించి క్రీస్తు సంఘమనెడి ఏదెనుతోటను మరల నిర్మించెను (1కొరింధీ 15:54-56).

దేవుని సహవాసమునకు దూరమైన మానవుడు తిరిగి పరలోకమునకు వెళ్లాలంటే క్రీస్తు సంఘసభ్యులై క్రీస్తునందు జీవించాలి. అంతేకాని మతశాఖల విధానము ద్వారా అదిసాధ్యపడదు. మతశాఖలు మానవ కల్పితములు. వాటి ఉనికిని ఎక్కడా మనము లేఖనములలో కనుగొనము. కావున క్రీస్తు సంఘమే సాటిలేనిది. ఒక ఉదాహరణను చూద్దాము. ఒక చేప జీవించాలంటే అది నీటిలోనే వుండాలి. నేలపై అది ఎంతమాత్రము జీవించలేదు. అది దేవుడు ఏర్పరచిన ప్రకృతి

నియమము. ఆలాగే ఒక వ్యక్తి ఆత్మీయముగా నిత్యము జీవించాలంటే నీటిమూలము గాను. ఆత్మమూలముగాను జన్మించి క్రీస్తు సంఘములో చేర్చబడవలెను.

కావున క్రీస్తు సంఘమే సాటిలేనిది. "మనలో కార్యసాధకమైన తన శక్తిచొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తి గల దేవునికి, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక ఆమేన్" (ఎఫె 3:20-21).

- సూరంపూడి వీరంశెట్టి ,
ముమ్మిడివరం.

## పరలోక రాజ్యపౌరులు

మన ప్రభువు లోతైన పాఠములను బోధించుటకు చాలా సామాన్యమైన ఉదాహరణలను ఉపయోగించారు.

యేసు ఆయన రాజ్యమును గూర్చి చెప్పెను. ఆయన శిష్యులు పరలోక రాజ్యమును గూర్చి అవగాహనలేని వారు మరియు పరలోకరాజ్యములో ఎవడు గొప్పవాడో తెలుసుకొనవలెననెడి ఆత్రుత కలిగి యుండిరి. ఆయన ఒక చిన్నపిల్లవాని పిలిచి పరలోక రాజ్యమపౌరులు కాగోరువారు చిన్నపిల్లవాని గుణగణాలను కల్గియుండాలని జవాబిచ్చెను.

1. వినయము ( Humility) :- చిన్నపిల్లవాడు వినయమునకు వారసుడు. పరలోక రాజ్యవారసులు కాగోరువారివలె అతని స్వభావము యావత్తు నమ్మిక, నమ్రత లేక వినయము, ఆధారపడుటయై యున్నది. పరలోక రాజ్యములో ప్రవేశించవలెనన్న మన పెద్దల స్వభావమైన గర్వపు స్వభావమునుండి మార్పు చెందాలని ఈ చిన్న ఉదాహరణ ద్వారా యేసు బోధించారు. మనయొక్క స్వంత చిత్తాన్ని ప్రక్కనపెట్టి ఆయన వాగ్దానముల ఎడల నమ్మిక యుంచాలి మరియు మనము చేయు పనులన్నియందు ఆయనపై సంపూర్తిగా ఆధారపడాలి. ఆయన మన ప్రభువై యున్నాడు- ఆయన మనలను నడిపించుటకు గాను ఆయన ఎడల నమ్రత కలిగియుండాలి.

2. నమ్మిక కలిగి యుండాలి (· Trust) :- చిన్న పిల్లవాడు తన తల్లి లేక తండ్రి యొక్క చేతిని పట్టుకొని ఏ భయమును ఏ సంశయమును లేకుండా యుంటాడు. తన యొక్క కాపుదల కొరకు, సౌఖ్యము కొరకు, అతని నమ్మిక కొరకు మరియు నడిపింపు కొరకు వారివైపు చూస్తాడు. రాజులకు రాజు ప్రభువులకు ప్రభువైన యేసుతో కూడా క్రీస్తు రాజ్యపౌరులు అట్టి సంబంధాన్ని కలిగియుండాలి.

3. సాధారణత్వము ( Simplicity ):- పెద్దవారివలె ఒకచిన్న పిల్లవాడు తనమేలే చూచు కొనవలెనను కోరిక కలవాడు కాడు. అతి ఖరీదైన ఆట వస్తువుకు బదులు చిన్న అట్టపెట్టెతో ఆనందంగా ఆడుకొనగలడు. అతి సాధారణమైన విషయములలో ఆనందాన్ని మరియు స్వయం సమృద్ధిని పొందగలడు. అవసరతలో నున్నవారికి సేవచేయడం ద్వారా, మన తోటి సహోదరులు శారీరక, ఆత్మసంబంధమైన అవసరతలను తీర్చుటద్వారా పరలోక రాజ్య సంబంధులు ఆనందాన్ని పొందవచ్చు. ఏ స్థితిలో ఉన్నప్పటికి ఎక్కడ యున్నప్పటికి స్వయంసమృద్ధిని కల్గియుండుటలో శాంతి కలదని అతడు తెలిసికొనవలెను.

4. ఉపదేశమును అంగీకరించుట (Accepts Instructions ) :- చిన్నపిల్లవాడు అడుగుటయే కాక ఉపదేశమును అంగీకరించును. నేర్చుకొనుటకు ఆశ కల్గియుంటాడు. కొన్నిసార్లు ఏదో ఒక విషయమై తన దృష్టిని కేంద్రీకరించి దానిలో ప్రావీణ్యాన్ని పొందువరకు ప్రయత్నం చేస్తాడు. ఎందుకనగా అతడు వేగముగా నేర్చుకొను గుణమును కల్గియుంటాడు. అందుచేత 3 సంవత్సరములలో అతడు తన తల్లిదండ్రులు మాట్లాడు భాషా పరిజ్ఞానమునంతటిని పెంపొందించుకుంటాడు. కాని పెద్దలు పరలోక రాజ్యమును గూర్చినటువంటి నిబంధనలను, జ్ఞానమును తమ జీవిత కాలమంతటిలో అభివృద్ధిపరచు కొనుటలో కృతార్థులు కాలేక పోవుచున్నారు. అందుచేత పరలోక పౌరులు చిన్నపిల్లవాని యొక్క గుణాలను తప్పనిసరిగా అభివృద్ధి పరచుకొనవలెను.

5. ప్రేమ ( Love ) :- చిన్నపిల్లవాడు ప్రేమించుటకు ప్రేమించబడుటకు సంసిద్ధంగా యుంటాడు. ఇతరులను ప్రేమించుటకు వెనుకాడడు. కాని ఇతరులు ఎంత ప్రేమను పొందగోరుదురో అంత ప్రేమను పంచి ఇచ్చుటకు సంసిద్ధముగా ఉంటారు. ప్రేమించుటకు ప్రేమించబడుటకు పెద్దలకు అవరోధముగా యున్నజాతి, కులము మొదలగా వానిని గూర్చి అతడు ఆలోచించడు. ఇవన్నియు పరలోక రాజ్యపౌరుల యొక్క గొప్ప గుణాలు.

యేసు ఈ విషయములనన్నిటిని విషదీకరించలేదు గాని ఆయన శిష్యులకు బోధించుటకు వీనిని ఉపయోగించారు. యేసు ఒక చిన్న బిడ్డను తనయొద్దకు పిలిచి వారి మధ్యను నిలువబెట్టి ఇట్లనెను "మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పు చున్నాను" (మత్తయి 18:2,3). వారు దానిని గ్రహించారు. మనము గ్రహించామా?

- జోరో (VOT)

కొండమీద ప్రసంగము-31

## దేవుని చిత్తమునకు లోబడుట

### ( Obeying the will of God )

### ( మత్తయి 7:21-23 )

యేసుప్రభువు ఇట్లు బోధించారు: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా ? నీనామమున దయ్యములను వెళ్లగొట్టలేదా ? నా నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడు ఎరుగను; అక్రమము చేయువారలారా నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7:21-23).

ప్రభువు చెప్పిన ఈమాటలు ఆయన కొండమీద ప్రసంగము లోనివి.

పరలోక రాజ్యము, క్రీస్తు సంఘము రెండు సరిసమాన పదములు. గనుక ఆ రెండుఒక్కటే. ఒకడు దేవుని ఉపదేశమునకు లోబడినప్పుడు, అంటే చిత్త ప్రకారము చేయునప్పుడు అతడు క్రీస్తు సంఘములో ప్రవేశించును. రక్షింపబడినవారే ప్రభువు సంఘములో యుంటారు. గనుక తండ్రి చిత్తప్రకారము చేయుట అనగా క్రీస్తు సంఘ సభ్యుడై, రాజైన క్రీస్తును సేవించుట యని అర్థము.

## దేవుని చిత్తము

అయితే దేవుని చిత్తమేమై యున్నది ? యేసుప్రభువు ఇట్లనుచున్నారు: "నాయిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని. ఆయన నాకనుగ్రహించిన దాని యంతటిలో నేమియు పోగొట్టుకొనక, అంత్య దినమున దాని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమై యున్నది. కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నాతండ్రి చిత్తము. అంత్యదినమున నేను వానిని లేపుదును" (యోహాను 6:38-40).

దేవుని చిత్తమును నెరవేర్చు మార్గములో నడుపుటకే యేసుప్రభువు పరలోకమునుండి మానవలోకమునకు వచ్చెను. యేసునందు విశ్వసించి విధేయత చూపు ప్రతివానిని రక్షించుటయే దేవుని చిత్తము. యేసుక్రీస్తుకు విధేయత చూపు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే దేవుని చిత్తము.

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగమంతటిలోను, మానవులు దేవుని చిత్తమును జరిగించాలనే వర్తమానము మనకు కనబడుచున్నది. దేవుని చిత్తమును జరింగించుట యనగా ఆత్మమూలముగను నీటిమూలముగను జన్మించుటతో సమానము. ఏలయనగా ఒకడు ఆత్మమూలముగను నీటి మూలముగాను జన్మించని యెడల అతడు పరలోక రాజ్యములో ప్రవేశింపలేడు (యోహాను 3:3-5). దేవుని చిత్తమును జరిగించుట యనగా మార్పునొందుటతో సమానము. ఏలయనగా "మార్పునొంది బిడ్డలవంటి వారైతేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" యేసుప్రభువు చెప్పారు (మత్తయి 18:3).

గనుక ఒకడు దేవుని చిత్తమును జరిగించినప్పుడు అతడు మార్పునొందును,

లేదా తిరిగి జన్మించును. అయితే ఒకడు యేసుప్రభువునందు విశ్వాసముంచి, ప్రభువా, ప్రభువా అని పిలిచినంత మాత్రముననే రక్షింపబడడు గాని అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అ.కా. 2:38).

దేవుని చిత్తమునకు లోబడుట యనగా దేవుని అధికారమును గౌరవించి లోబడుట యని యర్ధము. యేసు కొండమీద ప్రసంగమును "ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రుల వలెగాక అధికారము గలవానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28,29). ఆయన చెప్పిన మాటలోను, చేసిన ప్రతిక్రియలోను దేవుని అధికారము ఆయన కుండెను. ఇహమందును, పరమందును కూడ ఆయనకు సర్వాధికార మున్నది (మత్తయి 28:18).

## స్వేచ్ఛ వలన ప్రమాదము

దేవుని చిత్తానికే లోబడుచున్నామని తలంచి తమ మనోభావాలకు లోబడి పనిచేసేవారికి అంత్యదినమున కలిగే ప్రమాదము గొప్పది. సత్యవాక్యమును సరిగ విభజింపకుండ వారి యిష్టము వచ్చినట్లు స్వలాభము కొరకు దేవుని వాక్యాన్ని వినియోగించి ఈ లోకంలో ప్రజలను మోసగించువారు అంత్యదినమున వారికి వారే మోసపోవుదురు. అట్టివారిని చూచి "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయువారలారా నా యొద్దనుండి పొండని ప్రభువు చెప్పును". వారు ఈలోకంలో యున్నప్పుడు దేవుని నామమున ప్రవచించామన్నారు. దయ్యములను వెళ్లగొట్టామన్నారు. మరియు వారి లెక్క ప్రకారము అనేకమైన అద్భుతములు చేసామన్నారు. అయితే వారు చేసిన దానిలో ఏ ఒక్కటి దేవుని చిత్తప్రకారమైనది కాదు. ఇంకో మాటలో సత్యవాక్యాను సారమైనది కాదు. అందువలన వారు అక్రమకారులు. వారినుండి మనం తొలగిపోవాలి.

దేవుని సృష్టియంతటిలోను మానవుడు నైతిక వర్తన కలిగి జీవించువాడు. అతడు దేవుని స్వరూపమున, ఆయన పోలిక చొప్పున చేయబడినవాడు. గనుక మానవుడు స్వేచ్ఛ యిచ్ఛ, కలిగినవాడు. అతనికి వివేచన విచక్షణ జ్ఞానము

ఇయ్యబడినది. అందువలన అతడు దేవుని గాని అపవాదిని గాని సేవించుటకు ఇచ్ఛయించుకొనవచ్చును.

అయితే మానవుడు దేవుని సేవించు గొప్ప బాధ్యత గలవాడు. మానవుడు తన పూర్వపు స్థితినుండి పడిపోయి పాపము చేసినను, అతడు దేవునికి, క్రీస్తుకు లోబడి జీవించిన యెడల రక్షణ అనుగ్రహించబడినది. ప్రభువా, ప్రభువా అని పిలుచువాడుగాక, అట్లు పిలుచుచు పరలోకమందున్న తండ్రి చిత్తప్రకారము జరిగించువాడే పరలోక రాజ్యములో ప్రవేశించును.

ఒకడు రక్షింపబడి దేవుని కిష్టుడై యుండాలంటే దేవుని చిత్తానికి విధేయత చూపుటత్యవసరం. దమస్కుకు పోవు మార్గములో సౌలుకు ప్రభువు కనబడినప్పుడు, "ప్రభువా నేనేమి చేయవలెనని" అతడడిగాడు. అందుకాయన నీవు పట్టణములోనికి వెళ్లుము అక్కడ నీకు తెలియజేయబడునని అతనికి చెప్పెను. అననీయ అను సువార్తికుడు తరువాత సౌలును సందర్శించి అతడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెనని చెప్పగా సౌలు లేచి వెంటనే బాప్తిస్మము పొందెను. అట్లు ప్రభువు చిత్తమునకు అతడు లోబడెను.

పాతనిబంధన గ్రంథములో రాజైన సౌలు మనకు కనబడుచున్నాడు. దేవుని మాటలకు విధేయత చూపుట కంటే వేరేమార్గములేదని అతడు చాల ఆలస్యముగా నేర్చుకొన్నాడు. అమాలేకీయులను సర్వనాశనము చేయుమని దేవుడు అతనికి ఆజ్ఞయిస్తే, వారి గొర్రెలలోను, ఎడ్లలోను కొన్నింటిని అతడు తీసికొని వచ్చాడు. వారి రాజును కూడ అతడు చంపకుండ తీసికొని వచ్చాడు. అయితే దేవుడు "ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్టము" అని ప్రవక్తయైన సమూయేలు ద్వారా అతనికి తెలియజేసాడు (1సమూయేలు 15:22). మన విధేయతకు కొలబద్ద దేవునివాక్యమే. మన స్వభావము సరియైనదయితే ఆయన బోధను గౌరవిస్తాము. అసత్యాన్ని అబద్ధ బోధను తిరస్కరిస్తాము.

అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో, పేతురు మొట్టమొదటి సువార్తప్రసంగము చేసాడు. మనుష్యులను రక్షించుటకు దేవుని చిత్తమేమైయున్నదో

అతడు వారికి తెలియజేసాడు. ఆ దినమున ఇంచుమించు మూడు వేలమంది తమ పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందారు, రక్షింపబడ్డారు. పరలోక రాజ్యమైన ప్రభువు సంఘముతో చేర్చబడ్డారు.

తార్సువాడైన సౌలు, లేచి ఆయన నామమున బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుమని చెప్పబడగా వెంటనే అట్లు చేసాడు. ప్రభువు చిత్తమునకు లోబడ్డాడు.

అ.కా. 16వ అధ్యాయములో ఫిలిప్పయి చెరసాల అధిపతి అర్ధరాత్రివేళ ప్రభువు చిత్తాన్ని తెలిసికొని అతడును అతని యింటి వారందరును బాప్తిస్మము పొందారు. ప్రభువు చిత్తాన్ని తెలిసికొని ఆయనకు లోబడినవారి ఉదాహరణలు అపొస్తలుల కార్యముల గ్రంధములో మనకు వ్రాయబడియున్నవి.

మనం అందరం రక్షింపబడాలని ప్రభువు చిత్తమైయున్నది. మనం యేసు ప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు బొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందితే ఆయన మన పాపములను క్షమించి రక్షిస్తారు. ఈరోజు ఆ పనిని మీరెందుకు చేయకూడదు ?

- జాషువా గూటం.

## లేని వార్త పుట్టింపకూడదు (లేవి.కా. 23:1)
## ( Do not Raise a False Report )

లేనివార్త పుట్టింపకూడదు అని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించాడు. క్రొత్తనిబంధనలో-"మీ సంభాషణ ఉప్పువేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపాసహితముగాను ఉండనీయుడి" అని పౌలు వ్రాసాడు (కొలస్సయి 4:6). క్రైస్తవులు లోకమునకు వెలుగుగాను, తమ సత్క్రియల వలన దేవునికి మహిమకరం గాను జీవించాలి (మత్తయి 5:13-16). అలా జీవించుటలో నాలుకను తమ స్వాధీనము నందుంచుకోవాలి. లేనివార్త పుట్టించుట లోతైన గాయమును చేయును. నాలుకతో చేసే ఈ పాపము వలన కలుగునష్టం అపరిమితం. కుటుంబములు, సంఘములు కూడా లేని వార్త పుట్టించుట వలన నాశనమగును. అందువలన నాలుకను స్వాధీనమందుంచుకోవాలి. యాకోబు 3:2-12 చదవండి.

లేని వార్తలు పుట్టించు అనగా కొండెములు, లేక అబద్ధములు, చాడీలు చెప్పుట. ఒకడు చేయనిది చేసినట్లు, చేసినది చేయనట్లు, పలికినది పలుకనట్లు, పలకనిది పలికినట్లు చెప్పుటయే లేని వార్త పుట్టించుట. అట్టివానిని కొండెగాడు అందురు. లేని వార్త పుట్టించు కొండెగాని గూర్చిన కొన్ని బైబిలు వాక్యములు చూడండి.

"కొండెగాని మాటలు రుచిగల భోజ్యములు. అవి లోకడుపు లోనికి దిగిపోవును" (సామె 18:8, 26:22). మానిన గాయములను కొండెములు రేపును. అసహ్యము, ద్వేషమువలన కొండెములు చెప్పుట ప్రారంభమగును. అసూయ, అత్యాశ దీనికి పునాది. ఎదుటి వ్యక్తి పలుకుబడిని దెబ్బతీసి దానివలన ప్రయోజనం పొందు దురాశతో లేనివార్తను పుట్టింతురు. "నన్ను ద్వేషించువారు కూడి నా మీద గుసగుసలాడుచున్నారు. నశింప జేయవలెనని వారు నాకు కీడుచేయ నాలోచించు చున్నారు" (కీర్తనలు 41:7).

లేని వార్త పుట్టించుటవలన మిత్రభేదముకలుగును. "కొండెగాడు మిత్రభేదము చేయును" (సామె 16:28). అత్యంత సన్నిహిత స్నేహితులను బద్ధ శత్రువులుగా చేయునీ కొండెములు. ఇతరులపై లేని వార్త పుట్టించుట అనునది చేయరాని కార్యములు, దుష్టక్రియలలో ఒకటిగా ఎంచబడినది. కొండెగాండ్రు, చెడ్డవాటిని కల్పించువారు మరణమునకు తగిన వారు అని వ్రాయబడియున్నది (రోమా 1:28-31).

## అపాయకరం

లేని వార్త పుట్టించి, కొండెములు చెప్పుట చాలా అపాయకరమైనది. ఒకరిపై ఒకరికి కొండెములు చెప్పి లేని వార్తను పుట్టించి ఒకని పలుకుబడిని, పరువు ప్రతిష్టలను, దెబ్బతీయుదురు. ఈ అబద్ధములు అతని విశ్వాస జీవితమునకు అవరోధముగా సంక్రమించును. అతని సత్క్రియలు నిష్ప్రయోజనములుగా చేయునీ కొండెములు. కొన్ని సమయాల్లో ఇలా చెప్పబడిన అబద్ధములు వెలుగులోనికి వచ్చును. ఎవరిపై లేని వార్త పుట్టించిరో ఆ వ్యక్తి నిర్దోషియైతే, వెలుగులోకి వచ్చిన నిరాధార అపనిందలను అసత్యములను రుజువుచేయగలడు. కాని కొన్ని సమయాల్లో

కొండెములు విన్న వ్యక్తులు వాటిని తమ మనస్సులో ఉంచుకొని నిర్దోషిపై ద్వేషం అసూయ పెంచుకొని వారితో తమ సత్సంబంధములు తెంపుకొంటారు. పైగా వారు కూడా ఆ వ్యక్తిపై దుష్ప్రచారాన్ని కొనసాగించుదురు. ఇది చాలా దురదృష్టకరం. క్రైస్తవులు అలాగుండ కూడదు. సత్యమునకై నిలచి, సత్యమునసరించి నడుచుకోవాలి. సత్యమును పరిరక్షించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలి.

## మారుమనస్సు అవసరం

ఒకవేళ నీవు లేని వార్త పుట్టించిన వానివైతే, ఈ చెడుపని మానివేయాలి. నీ జీవితం దేవునికి అనుకూలంగా ఉండాలంటే, ఈ చెడుపని విషయమై మారుమనస్సు పొంది, ఎవరిపై లేని వార్త పుట్టించితివో, అతనిని క్షమాపణ వేడి, ఎవరితో అబద్ధము చెప్పినావో వారికి సత్యము తెలిపి వారిని కూడా క్షమాపణ కోరాలి. ఇలా నీ ప్రవర్తన సరిదిద్దికొని మార్చుకుంటె ఈ విషయమై నీవు న్యాయము చేసిన వానివి కాగలవు.

నీవు కొండెములు విన్నవానివైనచో, అవి ఎంత వరకు వాస్తవములను తెలిసికొనుటకు ప్రయత్నించాలి. విన్న ప్రతి మాట నిజమని గ్రుడ్డిగా నమ్మకూడదు. ఎవరిపై చెడు విన్నావో అతనిని గాని లేక అతని సన్నిహితునిగాని అడిగి వాస్తవము తెలుసుకోవాలి. అతనిని గూర్చి నీవు విన్నది నిజమని రుజువైతే, అతనిని ప్రేమ పూర్వకంగా హెచ్చరించాలి. నీ మాదిరి ప్రవర్తన, నీ హెచ్చరిక అతనికి మారుమనస్సు కలుగజేయునేమో ? "పాపిని వాని తప్పుడు మార్గము నుండి మళ్లించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములు కప్పివేయునని తాను తెలిసికొనవలెను"-- (యాకోబు 5:20). నీవు విన్నది అబద్ధము అని తేలితే ఆ అబద్ధములు చెప్పిన వ్యక్తిని కూడా ప్రేమపూర్వకంగా గద్దించి సరియైన దారికి మళ్లించుటకు ప్రయత్నించాలి.

## సాత్వికంతో సమాధానం

ఒకవేళ నీపైనే కొండెములు చెప్పబడినచో, ఆ విషయం నిన్ను ఎవరైనా ప్రశ్నించితే వారికి సాత్వీకంతో సమాధానమివ్వాలి. నీపై వచ్చిన ఆరోపణలను నీతో ముఖాముఖిగా అడిగినందుకు వారి మంచితనాన్ని, ధైర్యాన్ని ప్రశంసించాలి. నీవు

నిర్దోషివని తెలియజేయు ఆధారాలు కనుపర్చాలి. పౌలువలె దేవుని యెడల మాత్రమే గాక మనుష్యులు ఎడల కూడా ఎల్లప్పుడు నీ మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసికోవాలి (అ.కా. 24:16, 2కొరింథీ 8:20, రోమా 12:17). కీడుకు ప్రతికీడు చేయకూడదు. నీపైని నిరాధారమైన దుష్ప్రచారాన్ని విని, నమ్మి, నీతో ఏమియు చెప్పక నీతో వేరే విధంగా (మునుపటివలెకాక) ప్రవర్తించు వారి యెడల నీవు చేయునది ఏమియు లేక పోయినను, నీవు మాత్రం యధావిధిగా వారితో నీ సత్సంబంధాన్ని కొనసాగించాలి. దేవుడు నీ నిర్దోషత్వమును బయలుపర్చును కనుక ఓపికతో ఉండాలి.

మనము లేని వార్త పుట్టించకయు, కొండెములు చెప్పకయు, "నీ మాట అవునంటె అవును, కాదంటె కాదు" (మత్తయి 5:37) అను విధంగా సత్యము చెప్పుచు, సత్యమునునసరించి జీవింతము.

- V. J. బెన్సన్, హైదరాబాద్

## బైబిలు దేవుని వాక్యమని ఏల నమ్మవలెను?

## ( Why we should believe the Bible to be the word of God ?)

( గత సంచిక తరువాయి )

**VI.** బైబిలునందు సమస్తజ్ఞానము యిమిడియున్నది :-

1. బైబిలు సత్యగ్రంథము :- ఈ క్రింది లేఖనములు బైబిలు సత్యగ్రంథమని నిరూపించుచున్నవి.

(1) "యెహోవా నీకృప ఆకాశముకంటే ఎత్తయినది, నీ సత్యము మేఘములంత ఎత్తుగా నున్నది" కీర్త. 108:4; 57:9.

(2) " . . . ఆయన సత్యము కేడెమును,డాలునై యున్నది." కీర్త. 91:4.

(3) "నీనీతి శాశ్వతమైనది, నీధర్మశాస్త్రం కేవలం సత్యం." కీర్త. 119:142.

(4) "యెహోవా దయాళుడు ఆయన కృపనిత్యము వుండును; ఆయన సత్యము తరతరములుండును". కీర్త. 100:5.

(5) సత్యమందు వారిని ప్రతిష్ట చేయుము, నీ వాక్యమే సత్యం. యోహాను 17:17.

మరియు 15వ శతాబ్దములో "మెజెల్లాన్" అను ఖగోళశాస్త్రజ్ఞుడు భూమి గుండ్రముగా నున్నదని ప్రకటించెను. దీనిని తప్పుడు సమాచారముగానెంచి అతనిని అరెస్ట్ చేసియుండిరి. తరువాత "కొలంబస్" భూమిని చుట్టి వచ్చి భూమి గుండ్రముగా నున్నదని చెప్పెను. ఇది సత్యమని రుజువైనది. ఇట్టి గొప్ప సత్యమును దేవుడు క్రీస్తుకు పూరాతన సత్యగ్రంధమందు ప్రవచించెను. ఉదా :- కీర్త. 19:4, యోబు 26:7, సామె. 8:27, యెష. 40:22. కావున బైబిలు సత్యగ్రంధము.

2. బైబిలు - వైజ్ఞానిక శాస్త్రము : వైజ్ఞానిక (సైన్సు) శాస్త్రము సృష్టితోనే ఆరంభమైన దనుట జగద్విదితము. వైజ్ఞానిక శాస్త్రవేత్తలకు బైబిలే మూలాధారమనుట నగ్నసత్యము. ఇందుకు ఉదా :-

(1) ప్రముఖ ఆంగ్ల వైజ్ఞానిక శాస్త్రవేత్త " Herbert Spencer " మానవ మేధస్సుకు అందనివి 5 సంగతులు కలవని చెప్పెను. అవి.; 1. కాలము 2. శక్తి 3. పదార్ధము 4. రోదసీ 5. క్రియ వీటి సమ్మేళనమే యీ సృష్టియని ప్రకటించెను. అయితే దీనిని గూర్చి బైబిలు ఆదియందే బయలు పర్చియున్నది. ఈ క్రింది పట్టిక చూడుము.

| | 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|---|
| ఆది. 1:1 | కాలము | శక్తి | పదార్ధము | రోదసీ | క్రియ |
| | ఆదియందు | దేవుడు | భూమి | ఆకాశం | సృజించెను. |

కాబట్టి వైజ్ఞానిక శాస్త్రమునకు మూలాధారం బైబిలు.

(2) మానవుడు వైజ్ఞానిక జ్ఞానమును పెంపొందించుకొని 19వ శతాబ్దములో శస్త్ర చికిత్సను ప్రారంభించినాడు. బైబిలునందయితే ఏదేనులోనే శస్త్రచికిత్స జరిగి యున్నది. ఒక్కమాటతో చెప్పవలెనన్న సైన్సు బైబిలునుండియే ఆరంభమైనది.

3. పురావస్తు శాస్త్రగ్రంధము :-

(1) 1872లో జార్జిస్మిత్ కనుగొనిన బబులోను రాతిపలకల మీద

జలప్రళయమును గూర్చి వ్రాయబడెను.

(2) ఆరావళి పర్వతముపై నిలిచిన నోవహు ఓడ పలకలు నేటికిని ఇంగ్లాండునందు పురావస్తుశాలలో భద్రపరచబడియున్నవి.

4. భౌగోళిక గ్రంథము :- పర్వతములు, నదులు, దేశములు, పట్టణములు ఆనాటి పేరులనే కలిగియున్నవి. ఉదా :- ఆరావళి పర్వతములు 2. ఎర్రసముద్రము 3. సిరియా 4. యెరూషలేము మొదలైనవి.

5 చరిత్ర గ్రంథము :- రాజులు, రాజ్యములు పాలన, యుద్ధములు, చక్రవర్తులు, సామంతులు, సాంఘిక జీవనము మొదలగు వాటికన్నిటికి బైబిలే మూలాధారము. అబ్రహామునుండి నేటి ఆరాఫత్ వరకు గల పరిపాలనకు బైబిలు పునాదియైయున్నది. "హిందూదేశము మొదలుకొని 127 సంస్థానములను అహష్వేరోషురాజు పాలించెను" (ఎస్తే. 1:1). సింధు నాగరికత బైబిలునందలి బాబెలు నుండియే ప్రారంభమైనది. ఆర్థిక, సాంఘిక రాజకీయం యిందు యిమిడియున్నది.

6. ప్రవచన గ్రంథము :- యెహోవా దేవుడు ప్రవచించి; తన భక్తులద్వారా ప్రవచింపజేసిన 330 ప్రవచనములు అక్షరాల నెరవేర్చబడినవి. ఉదా :-

(1) "అది నిన్ను తలమీద కొట్టును, నీవు దానిని మడిమ మీద కొట్టుదువని" చెప్పెను (ఆది. 3:15). యేసుక్రీస్తు సిలువపై కొట్టబడుట, యేసుమృతిచెంది తిరిగిలేచుట ద్వారా సాతానును తలమీద కొట్టునను ప్రవచనం అక్షరాల నెరవేర్చ బడెను.

(2) "కన్యక గర్భవతియై కుమారునికని అతనికి ఇమ్మానుయేలు అనుపేరుపెట్టబడును" యెష. 7:14 . ఇది బెత్లెహేములో కన్య మరియకు యేసుక్రీస్తు జన్మించుట ద్వారా నెరవేర్చబడెను (మత్తయి 2:1, లూకా 2:567).

(3) యేసుక్రీస్తు దేవాలయనాశనమును గూర్చి ప్రవచించుట :- (1) క్రీ.శ. 68లో నీరో చక్రవర్తి యెరూషలేముపై దండెత్తి యెరూషలేము గోడలు పడగొట్టెను. (2) క్రీ.శ 70లో నీరో కుమారుడు తీతు యెరూషలేముపై దండెత్తి దేవాలయపు పునాదులతో సహా పెళ్ళగించెను. (3) తరువాత వచ్చిన రోమీయులు క్రీ.శ. 135లో

యెరూషలేముపై దండెత్తి యెరూషలేమును సర్వనాశనము గావించిరి. (4) క్రీ.శ 638లో అరబ్ మహ్మదీయ రాజు "కలీషాఉమర్" దండెత్తి ప్రత్యేకించి పట్టణమును విధ్వంసము గావించెను. (5) క్రీ.శ. 691లో ఐదవ ఖలీషాయగు "అబ్దుల్ మాలిక్" అనువాడు ఈ పట్టణమును పట్టుకొని దేవాలయపు అతి పరిశుద్ధ స్థలములోని రాతిమీద అనగా యెహోవా అబ్రహామును తన కుమారుని ఏ బండపై బలి అర్పించమని కోరెనో ఆ బండపై మసీదును నిర్మించెను. ఈమసీదునే " Dome of wthe Rock " అని అందురు.

ఇట్లు పరరాజుల పాలనలో బానిసత్వమును సహించలేక ఇశ్రాయేలీయులు ఆయా దేశములకు చెదరిపోయిరి.

(4) ఇశ్రాయేలీయులకు తిరిగి రాజ్యమునిచ్చుట :- అన్యదేశములనుండి ఇశ్రాయేలీయులను రప్పించి రాజ్యము నిచ్చెదనని ప్రవచించుట (యెహె. 37:21-23).

దేవుడు తాను ప్రవచించిన రీతిగా క్రీ.శ. 1948లో ఆయాదేశములనుండి చెదరిపోయిన యూదులను రప్పించి యెరూషలేము రాజధానిగా వారికి తిరిగి రాజ్యము నిచ్చెను. ఎంతటి గొప్ప నెరవేర్పు.

ఇట్టి గొప్ప సంగతులు మానవులెవరు చెప్పగలరు ? ఇది మానవులకు సాధ్యము కాదు. దేవునికే సాధ్యము. కావున "బైబిలు దేవుని వాక్యము ".

-జి. మార్కు, నందిగామ.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చరర్‌షిప్ మరియు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

తేదీలు : 1997 డిశంబరు 7 నుండి 12 వరకు
ఆదివారం నుండి శుక్రవారం వరకు

స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు
ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.

ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"
**Theme** : **"Jesus Christ, the Son of God "**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చరర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవుచున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్థన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.


నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

ఏప్రియల్ నెల సువార్తికుల సదస్సు 18వ తేదీన మాకన పాలెం (తూ॥గో॥జిల్లా) లో ఘనంగా జరిగెను. మరియు "మరణమైన తరువాత యేమిటి ? అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు పి.జె. కృపాలినిగారు మధ్యాహ్నం యన్.జె. మోహనరావు గారు అధ్యక్షత వహించిరి. సోదరులు కె.ప్రసాద్, యు.స్టాలిన్, జి.షడ్రక్, సి.హెచ్. వెంకట్రావు, జి.నాటీ సెయింట్, పాకాహెన్రీ, ఎ.కాసు, బి.ప్రసాదరావు, యన్.ఏలీయా, వి.హిట్లర్, ఇ.కె.వి. ప్రసాదరావు, బి.యోహాను మరియు జాషువా గూటం గార్లు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

మానవుడు "మరణమైన తరువాత అతనికి ఏమి సంభవించును?" అను ప్రశ్నకు జవాబును అన్వేషించుచున్నాడు. స్పష్టమైన, స్వచ్ఛమైన సమాచారము పరిశుద్ధ గ్రంథము మాత్రమే ఇవ్వగలదు. మరణము అంటే 'ఎడబాటు' అని అర్థము. "మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).

మరణమే మానవుని అంతమని భౌతికవాదుల నమ్మకము. క్రైస్తవునికైతే అది ఒక ధన్యత (ప్రక 14:13). అతడు పొందబోవు బహుమానమును బట్టి మరణమందు అతడు సంతసించును. క్రైస్తవునికి ఒక నిరీక్షణ కలదు (1థెస్స 4:13). మరణమైన తరువాతనే తన బహుమానమును మానవుడు అందుకొనును. అతడు జీవించి యుండగా అతడు జరిగించిన మంచి, చెడు క్రియలను బట్టి అతని బహుమానము నిర్దేశింపబడును. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). మనుష్యులందరు చనిపోయిన తరువాత తీర్పుదినము వరకు నీతిమంతులైతే పరదైసునందును ఆ నీతిమంతులైతే పాతాళ మందును వేచియుందురు. క్రీస్తు రాకడలో జరుగు మృతుల పునరుత్థానమును గూర్చి క్రీస్తు ప్రభువు స్పష్టముగ చెప్పెను (యోహా 5:29). 1 కొరింథీ 15వ అధ్యాయములో మృతులేలాగు లేతురు ? ఎట్టి శరీరముతో లేతురు ? అను ప్రశ్నకు సమాధానం వ్రాయబడింది.

తీర్పులో ప్రతివాడును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2కొరింథీ 5:10). తీర్పులో మానవులు నిత్యజీవమునకు కొందరు, నిత్యనరకమునకు

కొందరు వారి వారి క్రియలను బట్టి కొనిపోబడుదురు. ఒక మానవుడు జీవించి యుండగనే తనుపొందబోవు బహుమానము సిద్దము చేసికొనవలసియున్నది. మరణమునకు ముందే అంటే నీవు జీవించి యుండగనే నీవు చేసిన క్రియలను బట్టి నీ బహుమానము నిర్దేశింపబడును. ఒకడు మరణమైన తరువాత అతని ఆత్మీయ స్థితి మార్చబడదు. అందుచేతనే మృతుల నిమిత్తము ప్రార్థించకూడదు. మానవునికి మూడు స్థితులున్నాయి. **1.** భూమిమీద నివసించిన జీవితము. **2.** మరణం తరువాత కనిపెట్టు స్థలములో ( **WAITING PLACE** ) తీర్పుకొరకు ఎదురుచూడవలసిన స్థితి. **3.** తీర్పు తరువాత నిత్యత్వము పొందుట. మృతుల లోకములో రెండుభాగాలున్నాయి. **1.** పరదైసు **2.** చీకటి బిలము. పరదైసు ఆనందకరమైన ప్రదేశము. చీకటి బిలము (**TARTARUS** ) యాతనపడు ప్రదేశము (**2**పేతురు **2:4**, ప్రక **20:11-15**). యిందున్న వారందరు అగ్నిగుండములో పడవేయబడుదురు.

మాకన పాలెంలో సోదరులు కె. ఐజక్ గారు క్రీస్తుకొరకు మంచి పనిచేయు చున్నారు. స్థానిక సంఘము చక్కని ఏర్పాట్లు చేసిరి.

---

**Regd. No. H / KD-45 / K.D. H.O**
**Date of Posting : 15 th of Every month**

**From:**
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

**To**